

**రాష్ట్రస్థాయి పోటీలకు పిట్లం విద్యార్థిని** 3



**ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు లాభదాయకం** 2


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## సీసీ కెమెరాలతో భద్రత..

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామాల్లో భద్రంగా ఉంటాయని.. నేరాలు జరిగినప్పటికీ త్వరలోనే నిందితులను పట్టుకోవచ్చని ఎంపీడీవో అభినవ్ చందర్ అన్నారు. మండలంలోని కాస్లాబాద్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో గురువారం సర్పంచ్ చైతన్ యాదవ్‌తో ఎంపీడీవో సీసీ కెమెరాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్ చైతన్ యాదవ్ మంచి ఆలోచనతో ఎనిమిది సీసీ కెమెరాలను గ్రామంలో ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్వంత్ రావు, పంచాయితీ కార్యదర్శి శివాజీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సతీష్ యాదవ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





# పోలింగ్ ప్రశాంతం

▪ అక్కడక్కడ స్వల్ప ఘటనలు ▪ భారీ భద్రత ఏర్పాటు ▪ 13న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నిజామాబాద్ నగరపాలక సంస్థతో పాటు ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్, కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి, బిచ్కుంద మున్సిపాలిటీల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. తొలుత మంద కొడిగా ఓటింగ్ ప్రారంభమైనా మధ్యాహ్నం వరకు పుంజుకుంది. స్వల్ప ఉద్రిక్తతలు మినహా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.**

**– అక్షరటుడే, ఇందూరు/కామారెడ్డి**

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 61.90 శాతం ఓటింగ్ నమోదయింది. మహిళలు యువత వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం మొత్తం 142 డివిజన్లు, వార్డుల్లో ఎన్నికలు నిర్వహించారు. అన్ని మున్సిపాలిటీలో కలిపి మొత్తం 714 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యధికంగా నిజా మాబాద్ నగర పాలక సంస్థలు 350 మంది, బోధన్‌లో 162 మంది, ఆర్మూర్‌లో 153 మంది, అత్యల్పంగా భీమ్‌గల్‌లో 49 మంది బరిలో నిలబడ్డారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 488 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

### మధ్యాహ్నం తర్వాత పుంజుకున్న ఓటింగ్

గత మున్సిపల్ ఎన్నికలతో పోల్చితే ఈసారి తక్కువగా ఓటింగ్ జరిగింది. గత ఎన్నికలు సుమారు 66 శాతం నమోదు కాగా.. ఈ సారి 61.90 శాతం ఓట్లు పోలయ్యాయి. తొలి రెండు గంటల్లో కేవలం 8 శాతం మాత్రమే నమోదు కాగా.. మధ్యాహ్నం తర్వాత ఓటింగ్ సరళి పుంజుకుంది. నిజామాబాద్ కార్పొరేషన్ కంటే ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీలో ఎక్కువ శాతం ఓట్లు పోలయ్యాయి.

### స్వల్ప ఉద్రిక్తతలు..

మున్సిపాలిటీ ఎన్నికలు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా చెదరుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. అక్కడక్కడ స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని 19వ వార్డులో బీజేపీ కాంగ్రెస్ వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అలాగే భీమ్‌గల్‌లో ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని ఓ పార్టీ వర్గీయులు నినాదాలు చేశారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు.

### దొంగ ఓట్లు వేయడానికి యత్నం..

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రెండో టౌన్ పరిధిలోని గోల్డెన్ పబ్లిక్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓ యువతి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించగా మహిళ పోలీసులు, అధికారులు గుర్తించారు. దీంతో ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. అలాగే బోధన్‌లోని రాకాసిపేట, గోశాల పోలింగ్ బూత్‌లలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో అధికారులు గుర్తించి వారిపై ఫోర్జరీ కేసు నమోదు చేశారు.

### కట్టుదిట్టమైన ఏర్పాట్లు..

పోలింగ్ కోసం జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఓటర్లకు సౌకర్యాలు కల్పించారు. 4,375 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య నేతృత్వంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియను ఎప్పటికప్పుడు తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే జిల్లా ఎన్నికల అబ్జర్వర్ సత్యనారాయణ రెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.

### కామారెడ్డి జిల్లాలో ..

కామారెడ్డి జిల్లాలో 239 పోలింగ్ కేంద్రాలను అధికార యంత్రాంగం ఏర్పాటు చేసింది. కామారెడ్డి మున్సిపాలిటీలో 152, ఎల్లారెడ్డిలో 24, బాన్సువాడలో 39, బిచ్కుందలో 24 స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి ఎమ్మెల్యే ఆశిష్ సంగ్వాన్ ఎప్పటికప్పుడు పోలింగ్‌ను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రాజేష్ చంద్ర భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

### నిజామాబాద్ జిల్లా..

| మున్సిపాలిటీ | | పోలింగ్‌శాతం |
|---|---|---|
| నిజామాబాద్ | - | 59.12 |
| ఆర్మూర్ | - | 68.00 |
| బోధన్ | - | 68.64 |
| భీమ్‌గల్ | - | 69.78 |
| మొత్తం | - | 61.90 |

### కామారెడ్డి జిల్లా..

| | | |
|---|---|---|
| కామారెడ్డి | - | 65.94 |
| బాన్సువాడ | - | 73.66 |
| ఎల్లారెడ్డి | - | 79.77 |
| బిచ్కుంద | - | 78.49 |
| మొత్తం | - | 69.48 |




నిజామాబాద్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఓటు వేసిన ఎంపీ ధర్మపురి అర్వింద్




పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నాయకులు



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా




కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా



మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత





బీజేపీ నేత బస్వా లక్ష్మీనర్సయ్య



కామారెడ్డి కలెక్టర్ సంగ్వాన్

## బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట



**అక్షరటుడే, కామారెడ్డి :** కామారెడ్డి పట్టణంలో దొంగ ఓట్లు కలకలం సృష్టించాయి. పట్టణంలోని 8వ వార్డులో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి వచ్చాడని అతన్ని పట్టుకుని బయటకు పంపించారు. 9వ వార్డులో దొంగ ఓట్లు వేస్తున్నారన్న సమాచారంతో బీజేపీ నాయకులు నిఘా పెట్టారు. దేవునిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దేవునిపల్లిలో ఓటు వినియోగించుకుని 9వ వార్డులో ఓటు వేయడానికి రావడంతో బీజేపీ అభ్యర్థి నరేందర్ రెడ్డి అతడిని పట్టుకున్నాడు. దాంతో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాల దాడిలో పలువురికి గాయాలయ్యాయి. బీజేపీ కార్యకర్త తలకు బలమైన గాయం కావడంతో రక్తస్రావం అయింది. దాంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణ, రూరల్ సీఐలు నరహరి, రామన్ చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడిన బీజేపీ కార్యకర్తను జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి మాట్లాడుతూ.. 9వ వార్డులో తిమ్మక్ పల్లి, కోటాల్ పల్లి, దేవునిపల్లి గ్రామాల నుంచి సుమారు 150 మందిని ఓటరు లిస్టులో చేర్చారని, వారందరితో దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నించారని ఆరోపించారు.

## ఎల్లారెడ్డిలో ఉద్రిక్తత.. మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎల్లారెడ్డిలో ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ బూత్‌లలోకి ఎమ్మెల్యే మదన్ మోహన్ యథేచ్ఛగా వెళ్లి ఓట్లు వేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆరోపించారు. ఈ మేరకు ఎల్లారెడ్డి బస్టాండ్ ప్రాంతంలో ధర్నాకు దిగారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ జెడ్పీహెచ్ఎస్ బాలబాలికల పాఠశాల పోలింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఆయన తన పీఏలు, బాడీగార్డులతో పోలింగ్ బూత్‌లోకి వెళ్లారని.. ఇష్టారీతిన ఓట్లు వేయిస్తున్నారని పోలింగ్ బూత్‌కు చేరుకున్న జాజాల సురేందర్ ఆరోపించారు. పాఠశాల పోలింగ్ బూత్ వద్ద విధుల్లో ఉన్న స్థానిక సీఐ రాజిరెడ్డి మాజీ ఎమ్మెల్యేను అడ్డుకున్నారు. ఎమ్మెల్యేను పోలింగ్ కేంద్రాల్లోకి ఎలా అనుమతించారని సీఐ రాజిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల చెప్పుచేతుల్లో పనిచేస్తున్నారని సీఐపై విరుచుకుపడ్డారు. ఏ అధికారంతో ఎమ్మెల్యేను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించారని ప్రశ్నించారు. పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ కోసమే ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎమ్మెల్యేను ఎలా అనుమతి ఇస్తారని ఆయన గట్టిగా నిలదీశారు. వెంటనే పార్టీ కార్యకర్తలతో కలిసి స్థానిక బస్టాండ్



ప్రాంతంలో రహదారిపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు బలవంతంగా తమ వాహనంలోకి ఆయనను ఎక్కించారు. జాజాలను అరెస్టు చేసి అక్కడినుంచి నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జాజాలను అరెస్టు చేసి పార్టీ శ్రేణులను ఒక్కొక్కరిని అక్కడి నుంచి పోలీసులు పంపించేశారు.






మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి


పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధురాలు

# పోలింగ్ ప్రశాంతం




ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు






ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే యెండల దంపతులు


రైతు నేత కోటపాటి






## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్




**అక్షరటుడే, ఆర్మూర్:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ బూత్‌లకు వచ్చే ఓటర్లతో మర్యాదగా వ్యవహరించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈ మేరకు ఆర్మూర్ పట్టణంలోని పలు పోలింగ్ సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఆయా పోలింగ్ బూత్‌లను, ఇతర కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పోలీసు సిబ్బంది అసలత్వం వహించరాదన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా మెలగాలని, ఎన్నికల ప్రవర్తన నియమాలను తప్పకుండా ప్రతిఒక్కరూ పాటించాలని తెలియజేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని సీపీ తెలిపారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయం, సంతోష్ నగర్‌లోని విద్య హైస్కూల్‌లో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్మూర్ ఏసీపి వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, ఏఆర్‌వో భూమేశ్వర్ తదితరులున్నారు.


బ్యాలెట్ బాక్సులను తరలిస్తున్న సిబ్బంది



## స్ట్రాంగ్‌రూంలకు చేరిన బ్యాలెట్ బాక్సులు

**ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ పోరు ముగిసింది. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ ఐదు గంటలకు ముగిసింది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను పోలింగ్ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత నడుమ స్ట్రాంగ్‌రూంలకు తరలించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్**


బ్యాలెట్ బాక్సులను అప్పగిస్తున్న సిబ్బంది

## ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో మహిళలకు లాభదాయకం



**అక్షరటుడే, కోటగిరి:** డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉపయోగపడతాయని సర్పంచ్ కనక మేడల శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు గురువారం పోతంగల్ మండలంలోని బాకర్ ఫారం ద్వాక్రా సంఘ భవనంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బ్యాంకులు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం రుణాలు ఇచ్చేందుకు ఎంతో శ్రద్ధ చూపుతున్నాయన్నారు. 15 గ్రూపులకు ఇప్పటికే రూ.76లక్షల రుణాలను అందించారని.. మరో రూ.20 లక్షల రుణాలు ఇప్పించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. శ్రీనిధి నుండి కూడా వడ్డీ లేని రుణాలను రూ.7.30 లక్షలు మహిళలకు అందించామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాస్కర్, సీసీ రమేష్, శ్రీనిధి మేనేజర్ సుభాష్, మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాత, అంగన్‌వాడీ టీచర్, తరంగిణి, విమల, శకుంతల, లక్ష్మీబాయి, మంజుల, విజయలక్ష్మి, శోభారాణి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు పిట్లం విద్యార్థిని నవ్యశ్రీ



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్:** పిట్లం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం కవిత తెలిపారు. కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరులో మంగళవారం నిర్వహించిన సీఎం కప్ జిల్లాస్థాయి నెట్‌బాల్ జూనియర్ బాలికల విభాగం పోటీల్లో నవ్యశ్రీ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించిందని తెలిపారు. ఈనెల 20 నుండి 23 వరకు మహబూబ్ నగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, రఘురాం తదితరులు నవ్యశ్రీకి అభినందనలు తెలిపారు.

## కామారెడ్డిలో రేపటినుంచి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**అక్షరటుడే, కామారెడ్డి:** మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు ప్రత్యేక ఉచిత ఆరోగ్య సేవా శిబిరం నిర్వహించనున్నట్లు కామారెడ్డిలోని సంకల్ప ఆయుర్వేదిక్ హాస్పిటల్ వైద్యులు మృత్యుంజయ్ శివాచార్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో ఈ శిబిరం గురువారం నుంచి శనివారం వరకు కొనసాగుతుందని మృత్యుంజయ్ శివాచార్య తెలిపారు. చాలా అనారోగ్య సమస్యలకు సర్జరీలు అవసరం లేదన్నారు. వెన్నునొప్పి, మోకాలి నొప్పి, మెడనొప్పితోపాటు అన్ని కీళ్ల నొప్పులు, కదలికలో ఇబ్బంది, గట్టితనం వంటి సమస్యలతో బాధపడుతున్నవారు శిబిరానికి రావాలని సూచించారు. ఆయుర్వేద కీళ్ల చికిత్స (జానుహస్తి, స్థానిక అభ్యంగం, నాడీ స్వేదం, అగ్నికర్మ, కీళ్ల లేప చికిత్సలు), ఆక్యూ-లేజర్ థెరపీ, అల్ట్రాసౌండ్ థెరపీ, ఆక్యుపంక్చర్ ద్వారా ఆయా సమస్యలకు చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. శిబిరంలో ప్రతి రోజూ 20 మందికే అవకాశం ఉంటుందని, ముందస్తుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు కామారెడ్డిలోని సంకల్ప ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లోగాని, 99491 57912, 99854 28897లోగాని సంప్రదించాలని సూచించారు.

## రేపు విద్యుత్ ఉద్యోగుల నిరసన ప్రదర్శన

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు నిరసన బాట పట్టారు. ఈ మేరకు గురువారం వర్నిరోడ్‌లోని పవర్‌హౌస్ కార్యాలయంలో మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు టీజీపీఈజేఏసీ ప్రతినిధులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ బిల్-2025కు వ్యతిరేకంగా వారు గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఈ బిల్ కారణంగా ఉద్యోగులకు నష్టం చేకూర్చేలా ఉందని వారు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు తప్పనిసరిగా పాల్గొనాలని టీజీపీఈజేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా బుర్ర నారాగౌడ్

**అక్షరటుడే, లింగంపేట:** మండలం కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నారాగౌడ్ ఆలయ కమిటీగా వైస్ చైర్మన్‌గా ఛత్రపతి లక్ష్మణ్ గౌడ్ ఎన్నికయ్యారు. లింగంపేట గౌడ సంఘం అధ్యక్షుడిగా గోపి గౌడ్, ఉపాధ్యక్షుడిగా సంగన్నగారి ఈశ్వర్ గౌడ్‌లను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌడ సంఘం అభివృద్ధికి, ఆలయ అభివృద్ధికి పాటు పడతామన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్థులు పాల్గొన్నారు.

## తామరపూల కోసం చెరువులోకి దిగి ఒకరి మృత్యువాత

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** తామర పూల కోసం వెళ్లి ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని 5వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగర శివారులోని నందిగుట్ట వద్ద ఓ గుర్తు తెలియని మృతదేహం ఉందనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. చెరువులో ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఆ వ్యక్తి 40ఏళ్ల లోపు ఉన్నాడని తామర పూల కోసం చెరువులోకి దిగి పట్టుతప్పి నీటిలో మునిగిపోయినట్లుగా పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉన్నందున శవం గుర్తుపట్టలేనట్టుగా ఉందన్నారు. వివరాల కోసం 5వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై గంగాధర్ తెలిపారు.